

నేడు, రేపు మంత్రి నాదెండ్ల పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 4న సోమవారం అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో పర్యటిస్తున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం విశాఖపట్నం నుంచి బయలుదేరి 11 గంటలకు పాడేరు మండలం మినుములూరు లోని డి ఆర్ డిపోను సందర్శించి తనిఖీ చేస్తారు. 11:30 గంటలకు పాడేరులోని సుంద్రుపుట్టు ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శిస్తారు. అనంతరం పాడేరులోని కలెక్టరేట్ చేరుకొని పౌరసరఫరాల శాఖ అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఒంటి గంటకు పిఎంఆర్సి భవనానికి వెళ్లి భోజన విరామం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు కించమండ బయలుదేరి వెళ్లి ఎఫ్.పి (ఫెయిర్ ప్రైస్) షాపును తనిఖీ చేస్తారు.2.45 గంటలకు అరుకు బయలుదేరి వెళ్లి ఎం ఎల్ ఎస్ పాయింట్ను తనిఖీ చేస్తారు.3.30 గంటలకు అనంతగిరి హరిత రిసార్ట్స్ కు చేరుకొని రాత్రి బస చేస్తారు. 5న మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు హరిత రిసార్ట్స్‌లో ఎఫ్.పి . షాప్స్ డీలర్స్ తో జరిగే సమావేశంలో పాల్గొంటారు. తర్వాత నేరుగా విశాఖపట్నం చేరుకుంటారు.



శిథిల భవనంలో చదువుతున్న విద్యార్థులు

శిథిల భవనంలోనే చదువులు

- వర్షానికి కారుతున్న పాఠశాల
- స్లాబ్‌పై టార్పాలిన్లు కప్పిన వైనం
- నిలిచిన నూతన భవనం పనులు

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని భారమాసి పంచాయతీ పరిధిలోని బారపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందుల మధ్య విద్యను కొనసాగిస్తున్నారు. సుమారు 30 సంవత్సరాల పాత భవనం నేడు శిథిలావస్థకు చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదంగా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో 38 మంది విద్యార్థులు చదువుతున్నారు.
వర్షాలు పడే రోజుల్లో పాఠశాల నిర్వహణ అసాధ్యమవుతోంది. కొంచెం తడిసిన వెంటనే శిథిలమైన పైకప్పు నుండి నీరు కారుతోంది.భవనం పెచ్చులు ఊడి పోయి విద్యార్థుల తలలపై పడుతున్న ఘటనలతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు కూడా పనికిరానివిగా మారిపోయాయి. వంటగది గత 10 ఏళ్ల క్రితమే



పాఠశాలపై కప్పిన టార్పాలిన్లు



నిర్మాణ దశలో నిలిచిన భవనం పనులు

మంజూరైనప్పటికీ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. పరిస్థితుల్లో తల్లిదండ్రులు ముందుకు వచ్చి పాఠశాల మరమ్మతుకు మందుకు వచ్చారు. కొంత డబ్బును సేకరించి పాత భవనం పై భాగాన టార్పాలిన్ షీట్ కప్పారు. విద్యార్థుల చదువుకు తాత్కాలిక రక్షణ కల్పించారు.
2025 మే నెలలో కొత్త భవనం మంజూరైనప్పటికీ, పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన వెంటనే నిలిచి పోయాయి. కేవలం పిల్లర్లు నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా పనులు ఆపేశారు. అధికారులు స్పందించక పోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ, జిల్లా కలెక్టర్ స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి, పాఠశాల భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారే ప్రమాదముందని వారు తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి అమిత్ బర్దర్

పింఛను సొమ్ము చోరీకి పాల్పడిన

ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్ట్

- -రూ.15.62 లక్షల నగదు, సెల్ ఫోన్లు, స్కూటీ స్వాధీనం
- -జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు, కత్తులు

ప్రజాశక్తి-పాడేరు: ఇటీవల పెదబయలు మండలం బంగారుమెట్ట సమీపంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ను బెదిరించి పింఛను సొమ్ము అపహరించి దారి దోపిడీకి పాల్పడి పరారైన ఒడిశాకు చెందిన ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి నగదు,సెల్ ఫోన్లు ఒక స్కూటీ తో పాటు కత్తులు స్వాదీన పరుచుకొని వారిని, రిమాండ్ కు తరలిస్తున్నట్లు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు. ఆదివారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దారి దోపిడీకి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గత నెల జూలై 31 వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో పెదబయిలు మండలం బొండపల్లి పంచాయతీకి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ కటారి మత్స్యబాబు ఈ నెల 1వ తేదీన పెన్షన్ పంపిణీ చేయవలసి ఉన్నందున పెదబయలు ఎస్బిఐ బ్యాంకు వద్ద 15 లక్షల 62 వేలను బ్యాంక్ నుండి విత్ డ్రా చేసి గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో బంగారుమెట్ట సమీపంలో గుర్తుతెలియని దుండగులు మారణా యుధాలు (రెండు కత్తులతో) బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన సంగతి విధితమే! వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉన్న పింఛన్ సొమ్ము 15,62,000 రూపాయల చోరీ చేసిన ఘటనపై వెల్ఫేర్ అసిస్టెంట్, పెదబయలు ఎంపీడీవో ముంచింగిపుట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదుచేసి వేగవంతంగా దర్యాప్తు చేపట్టి గాలింపు చర్యలు ముమ్మరం చేసి నిందితుల ఆచూకీ తెలుసుకొని పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు. పోలీసు సిబ్బంది టీములుగా ఏర్పడి దుండగుల కొరకు గాలిస్తున్న సమయంలో ఈ నెల 2వ తేదీన ముంచింగిపుట్ మండలం జోలాపుట్ గ్రామ శివారులో దారి దోపిడీకి చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు అధిక మోతాదులో డబ్బులు పంచుకున్న సమయంలో జి.మాడుగుల సిఐ శ్రీనివాసరావు ముంచింగిపుట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జే.రామకృష్ణ సిబ్బంది ఆ ప్రదేశానికి వెళ్లి చాకచక్యంగా ముగ్గురు దుండగులను పట్టుకొని ప్రశ్నించారని తెలిపారు. దారి దోపిడీకి పాల్పడిన ఆ సొమ్మును పంచుకుంటున్నామని నిందితులు పోలీసుల ముందు నేరం అంగీకరించారని అయన అన్నారు. నిందితులు వద్ద 15,62,000 రూపాయిలను, మూడు ఆండ్రోయిడ్ మొబైల్‌ను, ఒక స్కూటీ, రెండు కత్తులను జి.మాడుగుల సిఐ, ముంచింగిపుట్ ఎస్సై స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ దొంగతనానికి పాల్పడిన నిందితులు ముగ్గురు వ్యక్తులు ఒరిస్సా రాష్ట్రం కు చెందిన సంతోష్ కుమార్ మహాపాత్ర(28), వికాస్ కొర(25), స్వప్నిక దురై(19) ఉన్నారన్నారు. ఈ ముగ్గురు నిందితులు ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా జైపూర్ బ్లాక్‌కు సంబంధించిన నిందితులుగా గుర్తించడం జరిగిందనీ ఎస్పీ వివరించారు. వీరిని రిమాండ్ తరలించనున్నామని ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.నిందితుల నుంచి రికవరీ చేసిన డబ్బు కోర్టులో హాజరు పరచనున్నామని ఎస్పీ తెలిపారు. అల్లూరి జిల్లా లో అన్ని ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజ్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో దొంగతనాలు నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ పిలుపు నిచ్చారు. దారి దోపిడీ దొంగలను చాకచక్యంగా పట్టుకున్న జి.మాడుగుల సిఐ బి.శ్రీనివాసరావు, ముంచంగిపుట్టు ఎస్ఐ జె.రామకృష్ణ, అరకు,పెదబయలు,ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్లుకు చెందిన జి.గోపాలరావు, కే.రమణ, ఎస్.రవికుమార్, ఎం.శ్రావణ్ కుమార్, సిహెచ్ భారత్, కే.సంజీవ్, అర్.రమేష్, కే.నారాయణరావు, పీ.రాముర్తి, సిహెచ్ రామమూర్తిలకు ఎస్పీ అమిత్ బర్దర్ చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో పాడేరు డీఎస్పీ ఎస్.సహబాజ్ అహ్మద్, సి.ఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

సున్నం రాజయ్య ఆశయ సాధనకు కృషి

- పలుచోట్ల వర్ధంతి సభలు - ఘన నివాళులర్పించిన సిపిఎం నాయకులు, ప్రజలు



చింతూరు సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



నివాళులర్పిస్తున్న రాజయ్య కుటుంబ సభ్యులు, సిపిఎం నాయకులు



సున్నంవారిగూడెంలో వర్ధంతి సభకు హాజరైన ప్రజలు

అమరజీవి, సిపిఎం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఆశయ సాధనకు కృషి చేస్తామని సిపిఎం నాయకులు, ఆయన కుటుంబీకులు, అభిమానులు, ప్రజలు ప్రతినబూనారు. ఆ మహనీయుని సేవలు మరువలేనివని కొనియాడారు. రాజయ్య ఐదో వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని రంపచోడవరం ఏజెన్సీలో సభలు, సమావేశాలు జరిగాయి. ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళ్లర్పించారు.

ప్రజాశక్తి - విఆర్‌పురం : రాజయ్య సేవలు చిరస్మరణీయమని సిపిఎం ఎఎస్ఆర్ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండలంలోని సున్నంవారిగూడెంలో సున్నం రాజయ్య వర్ధంతి కార్యక్రమం చేపట్టారు. రాజయ్య స్తూపం వద్ద వారి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, అభిమానుల మధ్య రాజయ్య భార్య చుక్కమ్మ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాజయ్య తల్లి కన్నమ్మ, అత్తయ్య వీరమ్మ, కుమార్తె లక్ష్మీ స్వరాజ్యం, కుమారులు చంద్రరావు, సీతారామరాజు అరుణాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో కిరణ్ మాట్లాడుతూ రాజయ్య భౌతికంగా మనకు దూరమైనా ప్రజా పోరాటాల్లో ఎన్నడూ మన వెన్నంటే ఉన్నారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన హయాంలో చేసిన భూఉద్యమాలు, తునికాకు పోరాటాలు, వెదురు కార్మికుల పోరాటం, గిరిజన చట్టాలపై రాజీలేని పోరాటం, పోలవరం ఉద్యమం లాంటివి మరపురాని ఘట్టాలని గుర్తుచేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఎటువంటి గర్వం లేని మనిషిగా నిలిచారన్నారు. ఆప్యాయం, అనురాగంతో, ఎదుటి వ్యక్తులను నొప్పించక ప్రజా సమస్యలే తన అజెండాగా ముందుకు సాగిన అమరజీవి రాజయ్య జ్ఞాపకాలను మరువలేమన్నారు. పోలవరం నిర్వాసితుల పరిహారం, పునరావాస కాలనీల్లో సమస్యల పరిష్కారం కోసం రాజయ్య స్ఫూర్తిగా ముందుకెళ్లాలన్నారు. గిరిజన చట్టాల పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు లోతా రామారావు, పల్లపు వెంకట్, సున్నం రాజులు, మేకల నాగేశ్వరరావు, బాబు బొర్రయ్య, సోయం చినబాబు, సున్నం రాజులు, మట్ల వాణిశ్రీ, కారం లక్ష్మి, ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్, సర్పంచులు పెట్టి లక్ష్మి, ఇసంపల్లి వెంకటేశ్వరరావు, పద్మ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, సున్నం రంగమ్మ, పోడియం శ్రీరామమూర్తి, గుండుపూడి లక్ష్మణరావు, వడ్లది రమేష్, పులి బొజ్జి, చీరపు తాతబాబు, కారం సత్తిబాబు, తుర్రం బాబూరావు, తోడం రాజు, సిఐటియు జిల్లా నాయకురాలు రాజేశ్వరి, ఆసు లక్ష్మయ్య, అచ్యుతరావు, సుబ్బారావు, ప్రకాష్, కాంతారావు, పద్మారావు, పండ వెంకటేష్, రాములమ్మ, లక్ష్మి, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎటపాక: మన్యం అభివృద్ధికి సున్నం రాజయ్య చేసిన కృషి ఎనలేనిదని సిపిఎం మండల కార్యదర్శి కాక అర్జున్‌దొర తెలిపారు. అమరవీరులు సున్నం రాజయ్య ఐదో వర్ధంతి కార్యక్రమాన్ని మురుమూరులో నిర్వహించారు. అర్జున్‌దొర సున్నం రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సున్నం రాజయ్య మన్యం అభివృద్ధికి, గిరిజన హక్కుల కోసం అలుపెరగని కృషి చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని అంతా ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమబాటలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఐ.పద్మావతి, నాయకులు సోయం వీరమ్మ, సత్యవాది సుమలత, సావిత్రి, బుజ్జి, నవీన్, సురబి రాజు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక శ్యామల వెంకటరెడ్డి భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడారు. రాజయ్య హయాంలో జరిగిన అభివృద్ధిని, పోరాటాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, ఎంపిటిసి వేక రాజ్ కుమార్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి ముర్రం రంగమ్మ, పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, కారం నగేష్, మడకం చిన్నయ్య, చింత రాంబాబు, వేక లెనిన్, పల్లపు పెద్ద రాములు, తెప్పల లక్ష్మయ్య, కారం కొండయ్య పాల్గొన్నారు.

కూనవరం : సున్నం రాజయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక మార్త శ్రీరాంమూర్తి భవన్‌లో ఘన నివాళ్లర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజయ్య ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఆవుల ఉపేంద్ర, పాయం సీతారామయ్య, ఆవుల మురళి, కర్నాటి శ్రీనివాసరావు, నోముల సత్యనారాయణ, తెల్లం తమ్మయ్య పాల్గొన్నారు.




మురుమూరులో నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు



కూనవరంలో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా కృష్ణ

ప్రజాశక్తి- రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కలిముకోట కృష్ణను జిల్లా జూనియర్ జూనియర్ కళాశాలల లెక్చరర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా లెక్చరర్లు సమావేశమై జిల్లా నూతన లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కృష్ణను ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కలింకోట కృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్స్ సమస్యలు పరిష్కరించే విధంగా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. సమస్య తన దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షునిగా రవి, కార్యదర్శిగా ఈశ్వరకృప, కోశాధికారిగా యన్.సాయి రమణను ఎన్నుకున్నారు. అబ్జర్వర్‌గా యన్‌ఏవి ఆదిత్య, డాక్టర్ మురళి పాల్గొన్నారు.



కృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది

5 నుంచి కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్ పోటీలు

ప్రజాశక్తి-సీలేరు: ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ రాష్ట్రస్థాయి ఇంటర్ సర్కిల్ కబడ్డీ మరియు టగ్ ఆఫ్ వార్ పోటీలు ఈనెల 5, 6, 7 తేదీల్లో సీలేరులో నిర్వహిస్తున్నామని స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ ఎపి జెన్కో ఎడిఇ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరులో స్పోర్ట్స్ చైర్మన్ ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. పోటీల్లో ఎపి జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కం ఉద్యోగులు కబడ్డీలో 20 జట్లు టగ్‌ఆఫ్‌వార్ లో 10 జట్లు పోటీల్లో తలపడతాయని తెలిపారు. స్పోర్ట్స్ కార్యదర్శిగా సబ్‌ఇంజనీర్ ఇన్‌చార్జి ఎఇ నాగేష్ ట్రెజరర్‌గా కే.లామ కొనసాగుతారని ఎస్సీ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డితో సమావేశమై పలు అంశాలు చర్చించి స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.

పోటీలకు సిద్ధమవుతున్న కబడ్డీ కోర్టు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో రాష్ట్రస్థాయి ఇంటర్ సర్కిల్ కబడ్డీ మరియు టగ్ ఆఫ్ వార్ పోటీలు ఈనెల 5వ తేదీ నుంచి ఏడో తేదీ వరకూ సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరులో ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు ట్రాన్స్కో జెన్కో డిస్కం ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొంటారు. కబడ్డీలో 20 టీములు, టగ్ఆఫ వార్‌లో 10 టీములు పాల్గొంటాయి. ఈ నేపథ్యంలోనే జెన్కో అధికారులు పర్యవేక్షణలో డిఎవి పాఠశాల ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో కబడ్డీ కోర్టు సిద్ధం చేస్తున్నట్లు ఇంటర్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ ఎపి జెన్కో ఎడిఇ శ్రీనివాస్ వెల్లడించారు. పోటీలు రసవత్తరంగా జరగనున్నాయని, క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు కూడా చేశామని ఆయన తెలిపారు.



చదును చేస్తున్న గ్రౌండ్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏజెన్సీలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టులు గత నెల 28 నుంచి ఈ నెల మూడో తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగియడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. వారోత్సవాలు చివరిదశలో ఎటువంటి సంఘటనకైనా పాల్పడవచ్చునని ఇంటలిజెన్సి వర్గాలు హెచ్చరించాయి. ఈ మేరకు ఎస్సై కె.రవీంద్ర సీలేరు ప్రధాన కూడళ్లలో పోలీసు బలగాలను మొహరించి వాహనతనిఖీలు నిర్వహించారు. ఎఒబి వద్ద ఒరిస్సా పోలీసులు గస్తీ ముమురం చేశారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు బలగాలతో జల్లెడ పట్టారు. మావోయిస్టు వారోత్సవాలు ఆదివారం సాయంత్రం ముగియడంతో పోలీసులు, సరిహద్దు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ (గ్రేడ్-1 (అరకులోయ)పంచాయతీ కార్యదర్శి పాంగి రాజ్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అరకు లోయలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రెవెన్యూ అధికారుల నుండి ఎన్వోసి నిర్ధారణను పొందడంలో విఫలమయ్యారన్నారు. నివేదిక సమర్పించే ముందు రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించలేదని, పంచాయతీ అధికారులు సర్వేనెంబర్ ను నిర్ధారించలేదని, రెవెన్యూ శాఖ ప్రమేయం లేకుండా అప్పటి జిల్లా కలెక్టర్కు పంచాయతీ తీర్మానంతో ప్రతిపాదనలు పంపలేదన్నారు. 15 లక్షల అంచనా అంచనా వ్యయం దాటిన నిర్మాణానికి నిబంధనలను ఉల్లంఘించి టెండర్లు పిలవలేదని, స్థానిక సర్పంచ్ స్వయంగా నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నారని పంచాయతీ కార్యదర్శి నివేదించారని, కానీ ముందుగా ఆ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారన్న కారణంతో సస్పెండ్ చేస్తున్నట్లు సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ విషయంలో పాడేరు సబ్ కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో కలిసి ఆ భూమిని పరిశీలించి ఇందులో లోపాలను గుర్తించి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించడంతో ఈ నివేదికను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి పాంగి రాజ్ కుమార్ ను సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు

శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- అరకులోయ: కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అల్లూరి జిల్లా ఏపీసి డాక్టర్ స్వామి నాయుడు, అరకులోయ మండల విద్యాశాఖ అధికారి వి త్రినాథ్ రావు కోరారు. స్థానిక గుడ్ మార్నింగ్ రిసార్ట్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ శిక్షణలో పలు జిల్లాల్లోని కేజీబీవి లలో పనిచేస్తున్న సోషల్ స్టడీస్ సిఆర్టి ఉపాధ్యాయులు మొదటిసారిగా ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ శిక్షణ ఈనెల మూడు నుంచి ఏడో తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిసి డిఓ కవిత, అబ్జర్వర్ రమేష్, శైలజ, సిఆర్పీలు జి.వాసు తదితరులు పాల్గొన్నారు.

8న మహా ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసి ప్రత్యేక డిఎస్సి కోసం ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆదివాసీ నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని ఆదివాసి స్పెషల్ డిఎస్ సి సాధన కమిటీ జిల్లా కో-కన్వీనర్ రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మెగా డిఎస్సీలోని ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి ఆదివాసి ప్రత్యేక డిఎస్సీతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట ఆదివాసి నిరుద్యోగుల మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆదివాసి నిరుద్యోగ సంఘం ఆదివాసి స్పెషల్ డిఎస్ సి సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా ఆదివారం పెదబయలు, ముంచింగిపుట్టు మండలాల పరిధిలో సాగిందని తెలిపారు. 8న పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట ఆదివాసి నిరుద్యోగుల మహా ధర్నాకు పాడేరు ఏజెన్సీ నలుమూలల నుంచి ఆదివాసి యువత, నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే జిఒ.3కి ప్రత్యామ్నాయంగా మరో జిఒ తీసుకువస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీని అమలు చేసి, ఆదివాసి స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ ఇవ్వాలని, జిఒ.3 రిజర్వేషన్ కాపాడుతూ ప్రత్యామ్నాయ చర్యలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ అమలు జాప్యంతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం ఆదివాసీల బాధలను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. 9వ తేదీ లోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


అరకులోయలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-అరకు లోయ: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా షెడ్యూల్ ప్రాంత ఆదివాసులకు వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్, ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ పై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. ప్రపంచ ఆదివాసీ వారోత్సవాల్లో భాగంగా అరకువేలి మండలం సరభగుడ గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కిల్లో జగన్నాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని ఈ నెల 1 నుండి 9 వరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని వారోత్సవాలుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీ షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు చేయాలనిద రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసులకు ఇచ్చిన వంద శాతం రిజర్వేషన్ హామీ అమలుకై ఈ నెల 9 న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియమాక చట్టం , ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ పై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. అల్లూరి జిల్లా లో అనంతగిరి, చింతపల్లి మండలాల్లో పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు, ఎర్రవరం ప్రాంతాల్లో అదానీ, నవయుగ ప్రవేట్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు జీఓ 51 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె మగన్న, ఆనంద్, గోపి , ప్రసాద్, పరుశురాం , కళ్యాణ్, లక్ష్మణ్, రాజు, మహేష్, గణేష్, దేవ, స్వర్ణ రాజ్, గోపాల్, నీలంబర్, శివ శంకర్ , మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్పురం: మాజీ ఎమ్మెల్యే ,గిరిజన సంఘం రాష్ట్ర నాయకునిగా చాలా కాలం పని చేసినటువంటి దివంగత కీ.శే. కామ్రేడ్ సున్నం రాజయ్య 5వ వర్ధంతి కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత.రామారావు చిన్న మట్టపల్లి గ్రామంలో ఛలో కోయతోర్ పండూం దక్కాట్ కూనవరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రాజయ్యగారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈనెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నాలుగు మండలాల స్థాయిలో కూనవరం మండల కేంద్రంలో జరిగే ఆదివాసీ దినోత్సవాన్ని అందరూ కలిసి గొప్పగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసి చట్టాలే కాక సంస్కృతి, సంప్రదాయాలు, కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందని రానున్న రోజుల్లో నేటి భావితరాలకు అవి దూరం అయ్యే పరిస్థితి ఉందని కాబట్టి వాటన్నిం టిని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిఒ నంబర్ 3 లేని కారణంగా ఏజెన్సీ ఉద్యోగాల్లో గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని తక్షణమే రాష్ట్రప్రభుత్వం పునరాలోచన చేసి ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన ప్రకారం శతశాతం ఉద్యోగాలు ఏజెన్సీలో గిరిజనులకే కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించి గిరిజన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కారం సుందరయ్య పూనమ్ ప్రదీప్కుమార్, పులిబోజ్జి, కారం సత్తిబాబు, పండ వెంకటేశ్వర్లు, గొర్రె రాజు, సీతయ్య, నరసయ్య పాల్గొన్నారు.


చిన్నమట్టపల్లిలో ఆదివాసీ జెండాను ఆవిష్కరిస్తున్న లోతా రామారావు

కలుషిత నీరే గిరిజనులకు ఆధారం

పాఠశాల నుంచి వ్యర్థపు నీరు గెడ్డలోకి విడుదల


గెడ్డలోకి చేరిన కలుషిత నీరు

ప్రజాశక్తి అనంతగిరి: మండల కేంద్రంలో ఉన్న బాలికల పాఠశాల 1 లో గల వసతి గృహంలో వినియోగిస్తున్న వ్యర్థపు నీటిని పాఠశాలకు దిగువ బాగం ఆనుకొని ప్రవహిస్తున్న గెడ్డలోకి వదిలేయడంతో గెడ్డ కాలుష్యం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థినిలు ఉన్న ఈ వసతి గృహంలో నిత్యం వినియోగిస్తున్న స్నానపు గదుల వ్యర్థపు నీరు, వంటలు వండేందుకు వినియోగించిన అనంతరం వెలువడుతున్న వ్యర్థపు నీటిని నేరుగా గెడ్డలోకి విడిచిపెడుతునానన్రు. దీంతో గెడ్డకు దిగువ ప్రాంతాలో ఉన్న వైఎస్సార్ వీది, పెద్దురు, ట్రాన్స్ఫార్మర్స్ వీది, పిఎసి కోలని, మొండి జామగుడ గ్రామాల ప్రజలు నిత్యం బట్టలు ఉతుకోవడం, అంట్లు కడుగు కొవ్వడమే కాకుండా జూనియర్ కళశాల విద్యార్థులు ఈ గెడ్డలో స్నానాలు చేస్తున్నారు. అదేవిధంగా చెత్తాచెదారం కూడా పారబోస్తున్నారని ఫలితంగా గెడ్డ పూర్తిగా కాలుష్యం అవుతున్నట్లు వాపోతున్నారు. ఈ నీటిని దిగువన స్థానికులు పలువురు తాగునీటికి ఉపయోగిస్తున్నారని, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు సైతం స్నానాలకు ఈ గడ్డని ఆశ్రయిస్తున్నారని చెబుతున్నారు. ఈ కారణంగా చర్మ వ్యాధులు వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిపై గతంలో పలుమార్లు పాఠశాల సిబ్బందికి చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మెడికల్ విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్ ప్లాజా వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మెడికల్ విద్యార్థులు గాయపడ్డారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ధారపాన రాకేష్ (20), యశ్వంత్ (21) ద్విచక్ర వాహనంపై సింహాచలం గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా దుక్కవానిపాలెం టోల్ప్లాజా సమీపంలోని సర్వీస్ రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యశ్వంత్, రాకేష్కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిద్దరూ తగరపువలసలోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో అనస్తీషియా విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్నారు. ధారపాన రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- రావికమతం: కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని జూదరులపై కేసు నమోదు చేయడం జరిగిందని రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపారు. మండలంలోని తోటకూరపాలెం గ్రామంలో నూకాలమ్మ తల్లి గుడి సమీపంలో కోడి పందెం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై రఘు వర్మ సిబ్బందితో దాడులు చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, 5 కోళ్లు, నాలుగు బైకులు, 1750 రూపాయలు నగదును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. చట్ట విరుద్ధమైన, అసాంఘిక కార్యక్రమాలుకు పాల్పడిన వారి పై చట్టపరంగా తగు చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవానికి గిరిజన రైతు

ప్రజాశక్తి-పెదబయలు : ఆగస్టు 15న ఢిల్లీలో జరుగు స్వాతంత్ర్య దినోత్సవానికి గిరిజన రైతుకు పిలుపువచ్చింది. పెదబయలు మండలం, గంపరాయి పంచాయతీ, చుంద్రుపొట్టు గ్రామానికి చెందిన గిరిజన రైతు వంజే నాగేశ్వరరావు ప్రధానమంత్రి చేతుల మీదుగా ఆగస్టు 15 అవార్డు అందుకోబోతున్నాడు. నాగేశ్వరరావు పూర్వికులు నుండి వస్తున్న పసుపు, పిప్పళ్ళ పంటను గత 20 ఏళ్లుగా సాగు చేస్తూ ఈ ప్రాంతంలో ఔషధ మొక్కల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తున్నాడు. ఆయన వ్యవసాయం చేస్తున్న తీరు వ్యవసాయ అభివృద్ధిని పర్యవేక్షణ చేసిన గిరిజన వికాస్ సంస్థ తను ఏర్పాటు చేసిన శ్రీమహిళా వికాస్ మాక్స్ సొసైటీలో కార్యకర్తగా జాయిన్ చేసుకుంది. దాని ద్వారా ఆ ప్రాంతంలో 600 మంది మహిళల్లో పొదుపు, ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్నాడు. దీంతో గిరిజన రైతు నాగేశ్వరరావు ఢిల్లీ నుండి ఆగస్టు 15న ఢిల్లీ హాజరు కావలసిందిగా సమాచారం అందింది. నాగేశ్వరరావుకు అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

మడ అడవులు, పులుల ప్రాధాన్యతపై కథలు

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌరగ్రంథాలయంలో మడ అడవులు, పులుల ప్రాధాన్యతపై ప్రఖ్యాత కథాకథన శిల్పి ఎస్.సీతశ్రీనివాస్ కథల రూపంలో పిల్లలకు ఆదివారం వినిపించారు. భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్, పబ్లిక్ లైబ్రరీ మియావాకి స్టోరీటైమ్ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం, అంతర్జాతీయ పులి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మడ అడవులు, పులుల ప్రాధాన్యతను పిల్లలకు ఆసక్తికరంగా తన కథల ద్వారా ప్రకృతి గొప్ప తనాన్ని ఎస్.సీతాశ్రీనివాస్ వివరించారు. ప్రకృతి తీరపు రక్షకులుగా ఎలా తీరాలను కాపాడతాయో, నేల క్షీణతను ఎలా తగ్గిస్తాయో, జలచరాలు, పక్షులకు ఆశ్రయంగా ఉంటాయో పిల్లలకు చక్కగా వివరించారు. అవి ఈనాటి అవసరమే కాకుండా రాబోయే తరాల భద్రత కోసం ఎంత ముఖ్యమో తెలిపారు.

పర్యావరణ సమతుల్యతకు చిహ్నంగా, ఆహార గొలుసులో పులి ఎలా కీలక పాత్ర పోషిస్తుందో, దాని సంరక్షణ ఎందుకు అవసరమో పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డిఎస్.వర్మ పాల్గొన్నారు.

ఎన్కౌంటర్పై ప్రత్యక్ష సాక్షులు విచారణకు హాజరు కావాలి

ప్రజాశక్తి - వై.రామవరం: పోలీస్ ఎన్కౌంటర్పై మెజిస్ట్రీరియల్ విచారణకు రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసులో సాక్ష్యం చెప్పేందుకు సంబంధిత వ్యక్తులు ఈ నెల 4 వ తేదీన సోమవారం హాజరు కావాలని వై.రామవరం తహశీల్దార్ వేణుగోపాలరావు ఆదివారం విలేకరుల సమావేశం లో తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారంగా ఈ సంవత్సరం, మే ఏడో తేదీన దుమ్ముకొండ గంగ కొండ అటవీప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో, కాకూరి పండన్న, అలియాస్ జగన్, రమేష్, అలియాస్ నాగన్న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి వారి కుటుంబ సభ్యులు గాని, వేరెవరైనా ప్రత్యక్షసాక్షులు ఉంటే రంపచోడవరం సబ్కలెక్టర్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని తహశీల్దార్ తెలిపారు.

ఇళ్లపై కూలిన చెట్టు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఒపి గేటు పక్కన ఉన్న వార్డు బాయ్లైన్లో ఆదివారం ఒక చెట్టు కూలిపోయి రెండు ఇళ్లపై పడింది. ఆ రెండు ఇళు రేకుల షెడ్లు కావడంతో రేకులు విరిగి లోపల పడ్డాయి. ఆ సమయంలో ఇళ్లలో ఎవరూ లేనందున ప్రమాదం తప్పింది. ఆకుల మహేష్, ఆకుల అశోక్కు చెందిన ఇళ్లపై చెట్టు పడింది. దీంతో ఇంటిలో సామగ్రికి నష్టం వాటిల్లింది. ప్రమాదం గురించి జివిఎంసి, సచివాలయం సిబ్బందికి బాధితులు సమాచారం అందించారు. కానీ ఆదివారం సెలవు అని సిబ్బంది చెప్పడంతో బాధితులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేకులు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.


రాజును పరామర్శిస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికునికి పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 98వ వార్డు పారిశుద్ధ్య కార్మికుడు,డప్పు కళాకారుడు ఎన్.రాజు అనారోగ్యంతో కెజిహెచ్ భవానివార్డ్లో చికిత్స పొందు తున్నారు. విషయం తెలియడంతో ఆదివారం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, యూనియన్ 3,4,6,8 జోన్ల కార్యదర్శులు గొలగాని అప్పారావు, జె.ఆర్.నాయుడు, కె.ఎస్. బాలు, ఎం.ఈశ్వర రావు, రాజు, యుజిడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇ.ఆదినారాయణ, శ్రామిక మహిళ కార్యదర్శి మీనాక్షి తదితరులు రాజును పరామర్శించారు. వారి కుటుంబాన్ని ఓదార్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తామున్నామని ధైర్యం చెప్పారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



పోస్టర్తో జ్యోతీశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: స్టీల్ప్లాంట్లో నోటీసులు ఇవ్వకుండా,చట్ట విరుద్ధంగా తొలగించిన 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటి కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షా శిబిరంలో పబ్లిక్ సెక్టార్ పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, గాజువాక ఎమ్మెల్యే, విశాఖపట్నం ఎంపీలు జోక్యం చేసుకోవాలని కోరారు. స్టీల్ప్లాంట్ భూ నిర్వాసితులు అందరికీ ఉపాధి కల్పించాలన్నారు. పాత వారి స్థానంలో చేపడుతున్న కొత్త నియామకాలను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బిహెచ్ఈఎల్ సిఐటియు యూనియన్ ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో టూరిజానికి ప్రాధాన్యం

- వైజాగ్ సర్కిల్ ఏడు జిల్లాల పరిధిలో నగర వనాల అభివృద్ధి
- పర్యావరణ పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి
- తాటిపూడిలో బోటింగ్ పునఃప్రారంభిస్తాం
- జీవ వైవిధ్యం పెంచేందుకు కృషి
- 'ప్రజాశక్తి'తో అటవీ సంరక్షణాధికారి దివాన్ మైదీన్





ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సహజ వాతా వరణాన్ని పరిరక్షించడా నికి చర్యలు చేపడుతు న్నట్టు విశాఖ సర్కిల్ అటవీ సంరక్షణాధికారి బిఎం.దివాన్ మైదీన్ తెలిపారు. మానవ జాతి మనుగడకు అవసరమైన భూమి, గాలి, నీరు, ఆహారం, వెలుతురు, వేడి, చలి లభ్యతలను పెంచేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లోగల ఇతర జీవరాసులను పరిరక్షించడం ద్వారా జీవ వైవిధ్యం (బయో డైవర్శిటీ) దిశగా అటవీ శాఖ ద్వారా ప్రయత్నిస్తున్నామన్నారు.

ఇలా పర్యావరణ పర్యాటకం (ఎకో-టూరిజం) చేయడం ద్వారా 50 శాతం పచ్చదనాన్ని పెంచనున్నామన్నారు. ఈ క్రమంలోనే ప్రజలకు మొక్కలు పంపిణీ చేస్తూ, ప్రకృతిని రక్షిస్తూ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గతంలో పలు కారణాల రీత్యా నిలిచిపోయిన విజయనగరం జిల్లా తాటిపూడి రిజర్వాయర్లో బోటింగ్ను త్వరలోనే పునః ప్రారంభించబోతున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులకు పెద్దపీట వేయబోతున్నామని వెల్లడించారు. 'ప్రజాశక్తి'కి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎంత విస్తీర్ణంలో ఎకో టూరిజం గ్రీన్ కవర్ చర్యలు తీసుకుంటున్నారు ?

రాష్ట్ర అటవీ శాఖ పరిధిలో 23 శాతం అడవులు ఏడు జిల్లాల పరిధి అయిన విశాఖపట్నం సర్కిల్లో ఉన్నాయి. మొత్తంగా 6574 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో శ్రీకాకుళం జిల్లా మొదలుకొని చింతపల్లి వరకూ అటవీ ఏరియా ఉంది. ఈ ప్రాంతాల్లో జనాలకు మొక్కలు ఇవ్వడం ద్వారా 50 శాతం గ్రీన్ కవర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నగర వనం కింద ఎక్కడెక్కడ అభివృద్ధి చేస్తున్నారు ?

నగరం, పట్టణాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉండే అటవీ ప్రాంతాలను ఎంపిక చేశాం. ఈ విధంగా నగర వనం కింద కంబాల కొండ, విజయనగరం జిల్లాలో సారిపల్లి, నెల్లిమర్ల, బేతనాపల్లి, శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గ, అనకాపల్లి జిల్లాలో బయ్యవరం, యలమంచిలి, నర్సీపట్నం, మన్యం జిల్లాలో పార్వతీపురం ప్రాంతాల్లో నగరవనం కింద అభివృద్ధి పనులు చేపట్టాం.

ఎకో టూరిజం కింద ఏయే ప్రాజెక్టులు చేపట్టారు ?

ఎకో టూరిజం కింద అరకులో కొండలపై ప్లాంటేషన్ చేపట్టాం. అనంతగిరి, మరదగూడ వంటి చోట్ల సిఎస్ఆర్ నిధులు సింహాద్రి ఎన్టిపిసి ద్వారా రూ.5 కోట్లు వచ్చాయి. ఎకో టూరిజం అభివృద్ధికి పనులు చేపట్టాం. లంబసింగిలోని కృష్ణాపురం వద్ద, పాడేరులోని వంజంగి వద్ద ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపడుతున్నాం. విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలోని తాటిపూడి రిజర్వాయర్లో బోటింగ్ సౌకర్యాలకు తిరిగి చర్యలు తీసుకుంటున్నాం.

వైజాగ్ సర్కిల్కు ప్రభుత్వం నుంచి నిధులెలా వస్తాయి?

ఏటా రూ.50 కోట్లు వరకూ విశాఖపట్నం అటవీ రేంజ్ ప్రాంతాల అభివృద్ధికి నిధులు వస్తాయి. కాంబా అనే పథకం నడుస్తోంది. ఏనుగులకు సంబంధించి పరిరక్షణ, ఏనుగులు జనావాసాల్లోకి వస్తే తీసుకోవాల్సిన చర్యల వంటివి ఈ పథకంలోకి వస్తాయి. అలాగే ఫారెస్ట్ ఫైర్ (అడవులు కాలిపోవడం) వంటి సందర్భాల్లో చేపట్టే చర్యలకు, నగర వనం కోసం నిధులను ఖర్చుచేస్తాం.

అటవీ జంతు సంపద ఎలా ఉంది ?

వైజాగ్ సర్కిల్ పరిధిలో అటవీ జంతు సంపద పుష్కలంగా ఉంది. బఫుల్లా (అడవి దున్న)లు ఉన్నాయి. చిరుత ఉంది. జింకలు విస్తారంగా ఉన్నాయి.

ఎలుగు బంట్లు, అడవి కుక్కలు (వైజ్ డాగ్స్) కూడా ఉన్నాయి. ఒడిశా నుంచి పెద్ద పులి ఒకటి నిత్యం తిరుగుతూ ఉంటుంది. అది పొలాల్లోకి రావడాన్ని ఒడిశాకు దిగువన గల శ్రీకాకుళం అటవీ ప్రాంత గ్రామాల్లో జనం చూస్తున్నట్లు చెబుతున్నారు. పెద్ద పులిని దూరం నుంచి చూసిన వాళ్లు వెనక్కి వెళ్లిపోతుంటారు. కొన్ని సందర్భాల్లో పులి పాదాలను చూసి మాకు తెలియజేస్తున్నారు.

మలబార్లో జ్యూయలరీ షో ప్రారంభం

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ : ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ విశాఖ స్టోర్లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూయలరీ షోను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ స్టోర్ హెడ్జరీన్ మాట్లాడుతూ "ఆర్టిస్ట్రీ షో' బ్రాండెడ్ జ్యువలరీ ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శన అన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శిస్తున్నామన్నారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణలుగా మలబార్ గోల్డ్ డైమండ్స్ వారి బ్రాండుల సమాహారం "మైన్" ధ్రువీకరించిన వజ్రాభరణాలు, వివాహం పార్టీ సంబరాల కోసం, 'ఎరా' అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి, 'ప్రెష్యా' జాతిరత్నాభరణాల సముదాయం, 'ఎత్నిక్స్' హస్తకళా నైపుణ్యతతో తయారైన ఆభరణాలు, "జోల్" అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలు, 'డివైన్' భారతీయ ప్రాచీన సంప్రదాయం వ్యక్తం చేసే ఆభరణాలు, ఇంకా చిన్నారుల కోసం 'స్టార్లెట్' పిల్లల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ఆగష్టు పదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని, బంగారు ఆభరణాల, రత్నాభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపు, మరియు వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు పొందవచ్చని చెప్పారు.


జ్యూయలరీ షోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ ఎంవిపి పోలీస్స్టేషన్ పరిధిలోని జరిగింది. సంఘటనపై పోలీసులు అందించిన వివరాలు ప్రకారం విశాఖపట్నం శివాజీ పాలెం నివాసి అయిన ఉల్లి పోలిరాజు (38) శనివారం రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 9 గంటలకు భార్యకు ఫోన్ చేసి మాట్లాడుతూ మాటల మధ్యలో అకస్మాత్తుగా అరిచి ఫోన్ కట్ చేశాడని తర్వాత అతని ఫోను స్విచ్ ఆఫ్ అయిందని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఇసుకతోట పెట్రోల్బంక్ సమీపంలోని డ్రైన్వద్ద ఒక వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మొదట గుర్తు తెలియని మృతదేహంగా భావించి దర్యాప్తు ప్రారంభించగా దర్యాప్తులో భాగంగా అతడు ఉల్లిపోలిరాజు అని తేలిందని అతని భార్య ఉల్లి చిన్న మృతదేహం ఫోటోలు ఆధారంగా భర్తను గుర్తించిందని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన ఎంవిపి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫిరాయింపు కార్పొరేటర్ల ఓటుహక్కు రద్దు చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెంలో ఉన్న కృష్ణ కాలేజ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జి.వి.ఎం.సి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్రావు ఆదివారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు పెండింగ్లో ఉండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఫిరాయింపుదారుల అనర్హత అంశం ప్రస్తుతం హైకోర్టులో ఉందని, ఇప్పటికే వారి పేర్లకు సంబంధించి కలెక్టర్ నోటీసులు పంపించారని తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లకు ఓటు హక్కు కల్పించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. వారి ఓటు హక్కును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపుదారుల ఓట్ల ఆధారంగా జరిగిన ఎన్నిక నిబంధనల ప్రకారం చెల్లదని హెచ్చరించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేసిన కార్పొరేటర్లు నక్కిల లక్ష్మి , సాది పద్మారెడ్డి, పల్లా అప్పలకొండ, బిపిన్ కుమార్ జైన్, కోడిగుడ్ల పూర్ణిమ, రేయి వెంకటరమణ కె.వి.శశికళ, గుండాపు నాగేశ్వరరావు, మహమ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి రామచంద్రరావు (చందు) తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి నాయకులు

విద్యార్థి సంఘాలను అనుమతించొద్దన్న జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : పాఠశాలల్లోకి విద్యార్థి సంఘ నాయకులను అనుమతించరాదంటూ రాష్ట్ర విద్యాశాఖ జారీచేసిన జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆదివారం ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జిఒ కాపీలు చింపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి హక్కుల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అనుమతించవద్దని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది విద్యార్థి హక్కులు, వారి స్వేచ్ఛను అణచివేయటంలో భాగమే అన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ప్రయోజనాల కోసమే ఈ జివో ఇచ్చారని ఆరోపించారు.విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి వెంటనే ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.